సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మోస్రా (చందూర్), అక్టోబర్ 28 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా.. బాన్సువాడలోని తన నివాసంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం అందజేశారు. మోస్రా మండలం గోవూర్‌లో ఒకరికి, చింతకుంట గ్రామంలో ఒకరికి, మోస్రా గ్రామానికి చెందిన ఆరుగురికి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు.

సెపక్‌తక్రా సబ్ జూనియర్ రాష్ట్రజట్టుకు సాత్విక్, భవిక్

సాత్విక్‌రెడ్డి, భవిక్

కంఠేశ్వర్, అక్టోబర్ 28 : హైదరాబాద్‌లోని విక్టరీ ప్లే మైదానంలో ఆదివారం నిర్వహించిన సెపక్‌తక్రా సబ్‌జూనియర్ ఓపెన్ ఎంపికలో జిల్లాకు చెందిన సాత్విక్, భవిక్ ఎంపికైనట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి గాదారి సంజీవరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు కేరళ రాష్ట్రంలో త్వరలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారులను జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు, ఉపాధ్యక్షుడు ల్యాబ్ గంగారెడ్డి, కార్యదర్శి కోచ్ చామకూర బాగారెడ్డి, సామ ప్రతాప్, మీసాల ప్రశాంత్‌కుమార్, సభ్యులు అభినందించారు.

సంగీత నృత్య పాఠశాలలో త్వరలో కొత్త కోర్సులు

సుభాష్‌నగర్, అక్టోబర్ 28 : నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న జ్ఞాన సరస్వతీ సంగీత నృత్య పాఠశాలలో త్వరలో కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ రవీందర్ రాజు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త కోర్సులు, పాఠశాల అప్‌గ్రేడ్ తదితర అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు లేటు ఫీజు చెల్లించి, ఈనెల 30వ తేదీలోగా ప్రవేశాలు పొందవచ్చని సూచించారు.

డీ-5 సెక్షన్‌కు చెందిన అసిస్టెంట్ లైన్‌మన్ కమలాకర్ సోమవారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ చేతుల మీదుగా జాతీయ స్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ 8వ జాతీయ వార్షికోత్సవం సందర్భంగా త్తమ సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కమలాకర్‌కు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.
- కంఠేశ్వర్, అక్టోబర్ 28

జిల్లా ప్రముఖ వైద్యుడు డాక్టర్ బాపురెడ్డికి జిల్లా ఆఫీసర్స్ క్లబ్‌లో క్లబ్ ప్రతినిధులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.
- ఖలీల్‌వాడి, అక్టోబర్ 28

'ప్రజావాణి'కి 65 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, అక్టోబర్ 28 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు విడుదల చేయాలి..

జిల్లావ్యాప్తంగా రెండు విద్యాసంస్థల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరు కాలేదని, గతంలో స్వీకరించిన మైనార్టీ కార్పొరేషన్ లోన్ అప్లికేషన్లకు సంబంధించి లోన్లు వెంటనే మంజూరు చేయాలని బీఆర్ఎస్ రూరల్ నియోజకవర్గ కార్యకర్తలు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

బీసీ కమిషన్‌కు సమస్యలు విన్నవించాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 28 : స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై వివిధ రాజకీయ పార్టీలు, సంఘా, ప్రజల అభిప్రాయ సేకరణకు వచ్చిన బీసీ కమిషన్ సభ్యులను నేడు (మంగళవారం) బీసీ కులస్తులు కలిసి సమస్యలు విన్నవించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ కోరారు. జిల్లాకేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీసీల సమస్యలను రాసుకుని, ఆరు జిరాక్స్ సెట్లను తీసుకొని కలెక్టరేట్‌కు రావాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితిగతులను రాజకీయ పార్టీలకతీతంగా బీసీ సంఘాలు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు ఆకుల ప్రసాద్, పోల్కం గంగాకిషన్, దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, రంగన్న, చంద్రకాంత్, సంజీవి, సాయిబసవ, లక్ష్మీనారాయణ రాజు, సుదర్శన్, గంగాధర్ పాల్గొన్నారు.

డీసీసీబీ వైస్‌చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 28 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) వైస్‌చైర్మన్‌గా మోపాల్ మండలంలోని బోర్గాం(పీ) గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో అప్పటి డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తన పదవి నుంచి తప్పుకోగా.. వైస్‌చైర్మన్‌గా ఉన్న రమేశ్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో వైస్‌చైర్మన్ స్థానం ఖాళీగా ఉన్నది. సోమవారం ఎన్నిక నిర్వహించగా చంద్రశేఖర్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఇన్‌చార్జి సీపీ సింధూ శర్మ ఆదేశాల మేరకు నగరంలో సోమవారం రాత్రి పోలీసులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు చౌరస్తా నుంచి, మున్సిపల్ కార్యాలయం, ధర్నాచౌక్ మీదుగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. - వినాయక్‌నగర్, అక్టోబర్ 28

రుద్రూర్ చేనేత సహకార సంఘం సందర్శన

సంఘంలో వివరాలను తెలుసుకుంటున్న ఏడీవో ప్రవీణ్‌కుమార్

రుద్రూర్, అక్టోబర్ 28 : మండలకేంద్రంలోని చేనేత సహకార సంఘాన్ని జౌళిశాఖ సిద్దిపేట్ ఏడీవో ప్రవీణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. సహకార సంఘం చైర్మన్ మొత్కూరి నారాయణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు తయారు చేసిన ఉత్పత్తులను టెస్కో ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. రికార్డులను పరిశీలించి, చేనేత వృత్తిపై ఆసక్తి ఉన్న వారికి రివర్స్ సర్వీస్ సెంటర్ ద్వారా 45 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు శిక్షణ సమయంలో స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారి జాబితాను పంపాలని సూచించారు. ఆయన వెంట జేటీఏ సతీశ్, సహకార సంఘం అధ్యక్షుడు మొత్కూరి నారాయణ, అకౌంటెంట్ నాగరాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అందజేత

రుద్రూర్/ ఖలీల్‌వాడి, అక్టోబర్ 28 : మండలకేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన తిరుపతిగారి కమల మృతదేహాన్ని ఆమె కూతుళ్లు నిజామాబాద్‌లోని మెడికల్ కళాశాలకు సోమవారం అందజేశారు. తాను మరణించిన తర్వాత మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అందజేయాలని తమ తల్లి చెప్పినట్లు కూతుళ్లు స్వర్ణలత, హేమలత వెల్లడించారు. ఆమె కోరిక మేరకు మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు, కండ్లను లయన్స్ క్లబ్ దవాఖానకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బూస ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు తోట రాజశేఖర్, లయన్స్‌క్లబ్ ఆచన్‌పల్లి, రుద్రూర్, భవానీ సభ్యులు, రాష్ట్ర అవయవదాన అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి, లక్ష్మి, శ్యామ్‌సుందర్ పహాడే, మృతురాలి కుటుంబీకులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లకు నిప్పంటించిన దుండగులు

వినాయక్‌నగర్, అక్టోబర్ 28 : నగరంలోని శివాజీనగర్ ఏరియాలో రోడ్డు పక్కన ఉండే తోపుడు బండ్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారని బాధితులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. శంకర్‌భవన్ ప్రభుత్వ పాఠశాల గోడ వద్ద పండ్లు విక్రయించే వ్యాపారులు తమ తోపుడు బండ్లను రాత్రి సమయంలో అక్కడే ఉంచుతారు. ఆదివారం అర్ధరాత్రి బండ్లు మంటల్లో కాలుతుండడాన్ని స్థానికులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే బండ్లతోపాటు పండ్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. పండ్ల వ్యాపారులు రెండో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై యాసిర్ ఆరాఫత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- **7 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు అపహరణ**

వినాయక్‌నగర్, అక్టోబర్ 28 : తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి బంగారం, వెండి, నగదును దోచుకుపోయారు. ఈ ఘటన నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో చోటు చేసుకున్నది. నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మగుట్టకు చెందిన రాములు మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి కామారెడ్డి జిల్లాలో ఉండే తన చెల్లెలి ఇంటికి వెళ్లాడు. ఆదివారం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం, బీరువా ధ్వంసం చేసి ఉండడంతో నాల్గోటౌన్‌లో ఫిర్యాదుచేశాడు. ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ఏడు తులాల బంగారు నగలు, 20 తులాల వెండితో పాటు సుమారు రూ. 50 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు

వినాయక్‌నగర్, అక్టోబర్ 28 : ఓ బాలికను ఆన్‌లైన్ ద్వారా పరిచయం చేసుకున్న యువకుడు పెళ్లి చేసుకుంటానని హైదరాబాద్‌కు రప్పించి, మోసం చేసిన ఘటనలో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తారకరామనగర్‌కు చెందిన ఓ బాలికను స్నాప్‌చాట్ ద్వారా ఆంధ్ర ప్రాంతానికి చెందిన శ్రీనునాయుడు పరిచయం చేసుకున్నాడు. బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి, హైదరాబాద్ వరకు రమ్మని చెప్పాడు. దీంతో బాలిక ఈనెల 19న హైదరాబాద్‌కు వెళ్లింది. బాలికను ఓ రూంలో ఉంచిన యువకుడు.. తమ పెళ్లి విషయం తన తల్లిదండ్రులతో ఒప్పిస్తానని చెప్పి అక్కడి నుంచి పారిపోయాడు. తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఫోన్‌నంబర్ ఆధారంగా హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం అక్కడి నుంచి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు శ్రీనునాయుడిపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

సంక్షిప్తంగా..

- **పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి** - డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీసీ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు డిమాండ్ చేశారు. తపస్ జిల్లా బాధ్యుడు రాజేశ్ నేతృత్వంలో డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.
- **టీయూలో జాతీయ మ్యాథ్స్ వేడుకలు** - డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : టీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీజీసీవోఎస్‌టీ)ఆధ్వర్యంలో టీయూలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఇంపాక్ట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆన్ ఆల్ఫా జనరేషన్ అంశంపై సెమినార్ నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య యాదగిరిరావు హాజరై మాట్లాడారు. కీలకోపన్యాసకులుగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి .. ట్రాఫిక్ వెయిటింగ్ టైమ్‌ను తగ్గించే క్యూయింగ్ థియరీ, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, కంప్యూటర్లలో గణిత శాస్త్రం ప్రాధాన్యతను వివరించారు. సెమినార్‌లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా.. పలు రకాల పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.
- **ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం** - సారంగాపూర్, అక్టోబర్ 28 : నగర శివారులోని నందన్‌రెడ్డి గెస్ట్‌హౌస్ సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నిజామాబాద్ సొసైటీ మాజీ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి.. సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్ కొట్టాల రవీందర్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి, సొసైటీ సీఈవో వంశీకృష్ణ, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.
- **అన్నిరకాల పంటలకూ మద్దతు ధర కల్పించాలి** - సిరికొండ, అక్టోబర్ 28 : రైతులు పండించిన అన్ని రకాల పంటలకూ ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బాకారం గంగారెడ్డి అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ రవీందర్‌రావుకు ఏఐకేఎంఎస్ నాయకులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. దొడ్డురకం ధాన్యానికి కూడా రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజన్న, రమేశ్, నడ్పన్న, సంతోష్, శ్యాంరెడ్డి, ఊశన్న పాల్గొన్నారు.
- **ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన** - ధర్పల్లి, అక్టోబర్ 28 : ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, కేరియర్ గైడెన్స్, మహిళా సాధికారత విభాగాల ఆధ్వర్యంలో 'ఆర్థిక అక్షరాస్యత' అంశంపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌బీఐ సిరికొండ విభాగం కౌన్సిలర్స్ కల్పన, సాయిలు... బ్యాంకులో పొదుపు పథకాలను వివరించారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన రాము, మైథిలి, నితిన్, యోగేశ్‌కు ప్రిన్సిపాల్ ఎన్.జ్యోతి సర్టిఫికెట్లను అందజేశారు.
- **బాలల హక్కులపై..** - డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : మండలంలోని వెస్లీనగర్ తండాలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, మహిళల రక్షణ, లింగనిర్ధారణ నిరోధక చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. డీసీపీవో చైతన్య ఆయా అంశాలపై తండావాసులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, అంగన్‌వాడీ టీచర్లు కమల, కల్యాణి పాల్గొన్నారు.
- **ఒవైసీ ఫొటో వైరల్ చేసిన వారిపై ఫిర్యాదు** – వినాయక్‌నగర్, అక్టోబర్ 28 : హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఫొటోను సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో రఘుపతికి మజ్లిస్ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఒవైసీకి వ్యతిరేకంగా ఫొటోను వైరల్ చేశారన్న ఫిర్యాదు మేరకు నిజామాబాద్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ ముఖీత్, ముంబైకి చెందిన ఖలీం షేక్‌పై కేసు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.
- **ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి** - డిచ్‌పల్లి, అక్టోబర్ 28 : ప్రభుత్వ భూమిని కబ్జాచేసిన రేషన్‌డీలర్ ఒడ్డెం నర్సయ్యపై చర్యలు తీసుకోవాలని మిట్టాపల్లి వీడీసీ సభ్యులు ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతిపత్రంఅందజేశారు. గ్రామశివారులో సుమారు 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతోపాటు రేషన్ పంపిణీలో కూడా అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.
- **ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో** - మోర్తాడ్, అక్టోబర్ 28: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. సోమవారం ప్రాజెక్ట్‌లోకి 9454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1091అడుగుల (80.501టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150, మిషన్ భగీరథకు 231, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.
- **దొంగతనాల నివారణకు సహకరించాలి**-శక్కర్‌నగర్, అక్టోబర్ 28: బోధన్ విద్యుత్ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో తరుచూ జరుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలను నివారించేందుకు రైతులు, వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పంట పొలాల పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్‌శాఖ వారు రాత్రి వేళలో నిర్వహిస్తున్న పెట్రోలింగ్‌కు రైతులు సహకరించాలని ఆయన కోరారు.
- **విద్యార్థులకు శిక్షణ ప్రారంభం** -నందిపేట్, అక్టోబర్ 28: నందిపేట్, తల్వేద జడ్పీహెచ్ఎస్‌లలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే 8వ తరగతి విద్యార్థులకు లక్కంపల్లి సాగర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని హెచ్ఎంలు మంజుల, మోహన్ సోమవారం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.
- **దరఖాస్తుల ఆహ్వానం** - నందిపేట్, అక్టోబర్ 28: జిల్లాలో తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందించనున్న ప్రైవేట్ టీచర్స్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వికాస్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 85006 62726, 81850 46621 నంబర్లలో సంప్రదించాలని కోరారు.
- **బాధ్యతల స్వీకరణ** - నందిపేట్, అక్టోబర్ 28: డొంకేశ్వర్ తహసీల్దార్‌గా ఎం.నరేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న అహ్మద్ హుస్సేన్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆలూర్ తహసీల్దార్‌గా పని చేసిన నరేశ్ డొంకేశ్వర్‌కు బదిలీపై వచ్చారు.
- **ఎల్ఆర్ఎస్ భూముల సర్వే**- ముప్కాల్, అక్టోబర్ 28: ముప్కాల్ గ్రామంలో సోమవారం ఎల్ఆర్ఎస్ భూముల సర్వే నిర్వహించారు. భూముల కొలతలు సరిగా ఉన్నాయా, ఇచ్చిన వివరాల ప్రకారం భూమి ఉన్నదా అనే విషయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, సిబ్బంది తాహిర్, రాజారెడ్డి, భూ యజమానులు పాల్గొన్నారు.
- **ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ రాజలింగం బదిలీ** - రెంజల్, అక్టోబర్ 28: ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ రాజలింగంను బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న రాజలింగానికి రెండున్నర ఏండ్ల క్రితం ఇన్‌చార్జి ఏఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో ప్రొటెక్షన్ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎడపల్లి సబ్ ఇంజినీర్‌కు ఇన్‌చార్జి ఏఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.
- **సన్మానం**- ముప్కాల్, అక్టోబర్ 28: కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సోమవారం ముప్కాల్‌లో గ్రామస్తులు ఆయనను సన్మానించారు.
- **జాతీయస్థాయిలో బంగారు పతకాలు**- ఆర్మూర్‌టౌన్, అక్టోబర్28: పట్టణానికి చెందిన జెస్సు వెంకట్ జాతీయ స్థాయిలో రెండు బంగారు పతకాలను సాధించాడు. హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద ఇటీవల నిర్వహించిన ఇండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలో బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ 82.5 కేజీల బాడీ వెయిట్ విభాగంలో పతకాలు సాధించాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏర్గట్ల, అక్టోబర్ 28: మండల కేంద్రం శివారులోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఏఎస్సై లక్ష్మణ్ నాయక్ కథనం ప్రకారం.. ఏర్గట్లకు చెందిన గాండ్ల నాగయ్య (45) ద్విచక్ర వాహనంపై బట్టాపూర్ వైపు నుంచి ఏర్గట్లకు వస్తున్నాడు. ఏర్గట్ల నుంచి బట్టాపూర్ వైపు వెళ్తున్న కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో గాండ్ల నాగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవఖానకు తరలించినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

బోధన్ రూరల్, అక్టోబర్ 28: బోధన్ మండలం చిన్నమావంది గ్రామానికి చెందిన గైని సాయికుమార్ (26) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సాయికుమార్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల చేతికి వాపు రావడంతో పాటు తలనొప్పి తీవ్రంగా ఉండడంతో మోతాదుకు మించి మాత్రలను వేసుకున్నాడు. అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈనెల 27న సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ హెడ్ కానిస్టేబుల్ ఎ.కిషన్ తెలిపారు.

గుండె పోటుతో బీహార్ హమాలీ..

ఎడపల్లి, అక్టోబర్ 28: కుర్నాపల్లి గ్రామంలో సోమవారం గుండె పోటుతో బీహార్ హమాలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన వకీల్ మకీయ(34) 12 మంది కూలీలతో కుర్నాపల్లి గ్రామానికి వచ్చి వడ్ల కొనుగోలు కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తోటి హమాలీలతో కలిసి భోజనం చేస్తుండగా గుండె నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. తోటి హమాలీలు బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తమ్ముడు సశీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాస్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బోధన్ రూరల్, అక్టోబర్ 28: పెంటాకుర్దు గ్రామానికి చెందిన గైని లక్ష్మణ్ (40) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి కథనం మేరకు.. పెంటాకుర్దు గ్రామానికి చెందిన గైని లక్ష్మణ్ పనులు చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈనెల 27న సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి సమయంలో భోజనానికి పిలిచేందుకు గదిలోకి కుటుంబీకులు వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య గైని సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

నవీపేట, అక్టోబర్ 28: మిట్లాపూర్ గ్రామానికి చెందిన సుంకరి ఛాయ(30), కూతురు రాగవి(11), కుమారుడు రితిక్(9)తో సహా అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 12 ఏండ్ల క్రితం మిట్టాపూర్ గ్రామానికి చెందిన సుంకరి రాజేందర్‌తో ఛాయకు వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రాజేందర్ పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఆయన పశువులను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇద్దరు పిల్లలు, భార్య కనిపించలేదు. పెద్ద కూతురు గ్రామంలోని హాస్టల్‌లో ఉంటున్నది. రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్, అక్టోబర్ 28: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్28: మండలంలోని పిప్రి జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. రూ.13 లక్షలతో దీనిని నిర్మించనున్నట్లు తెలిపారు. కొత్తగా ఆరు తరగతి గదులను నిర్మించాలని కోరుతూ హెచ్ఎం విశ్వనాథ్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

బహుమతుల అందజేత

ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ ఫొటో ఎగ్జిబిషన్‌ను సోమవారం ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సందర్శించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా 5లోగా పిల్లల బరువు చూడాలి

రిటైర్డ్ ఆయాను సన్మానిస్తున్న ఎంపీడీవో

రెంజల్/నవీపేట, అక్టోబర్ 28: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఎదుగుదలను తెలుసుకునేందుకు ప్రతి నెలా 5వ తేదీలోగా బరువు చూడాలని అంగన్‌వాడీ టీచర్లను రెంజల్ ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ ఆదేశించారు. రెంజల్ మండలం కిసాన్‌తండాలో సోమవారం ఐసీడీఎస్ సెక్టర్ సమావేశంలో నిర్వహించారు. గతనెలలో ఉద్యోగ విరమణ పొందిన దూపల్లి ఆయాను సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పర్యవేక్షకుడు శ్రీనివాస్, సూపర్‌వైజర్ ప్రమీలారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. నవీపేట ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ డిచ్‌పల్లి ప్రాజెక్టు సీడీపీవో స్వర్ణలత హాజరై మాట్లాడారు. పిల్లల్లో లోప పోషణ తగ్గించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రాధ లక్ష్మి, భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, జిల్లా ఐటీ కోఆర్డినేటర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మెడలో మూడు ఇండ్లు దగ్ధం

నందిపేట్, అక్టోబర్ 28: మండలంలోని ఉమ్మెడ గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో సోమవారం మూడు ఇండ్లు దగ్ధమయ్యాయి. ఇస్సాపల్లి నడ్పి భోజేందర్ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఆ ఇంటికి ఇరువైపులా ఉన్న ఇండ్లకు మంటలు వ్యాపించాయి. అగ్ని మాపక సిబ్బంది ఆర్.నరేశ్, సుధాకర్, సాయన్న వచ్చి మంటలను ఆర్పివేశారు. ఇస్సాపల్లి భోజేందర్, ఇస్సాపల్లి నడ్పి భోజేందర్, సాగర్‌ల ఇండ్లు దగ్ధం కాగా సుమారు రూ.ఆరు లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

శక్కర్‌నగర్, అక్టోబర్ 28: బోధన్‌లోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ ఆమేర్‌అలీఖాన్‌ను తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మసూద్ అహ్మద్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు.

102 అంబులెన్సు ప్రారంభం

నవీపేట,అక్టోబర్ 28: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సోమవారం 102 అంబులెన్సు వాహనాన్ని ప్రోగ్రాం మేనేజర్ మధుకుమార్ ప్రారంభించారు. మండలంలోని గర్భిణులు ప్రసవం కోసం ఆశ వర్కర్లకు సమాచారం అందిస్తే వారు ఈ వాహనం ద్వారా జిల్లా ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్తారని, ప్రసవం అనంతరం అదే అంబులెన్స్‌లో ఇంటికి చేర్చుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఎంఈ శ్రీకాంత్, అంబులెన్స్ కెప్టెన్లు వెంకట్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముత్యంరెడ్డి

నవీపేట/ఎడపల్లి/బాల్కొండ, అక్టోబర్ 28: నవీపేట మండలంలోని బినోలా, నవీపేట సొసైటీ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వెంకటరమణ, నిజామాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్‌తో కలిసి సొసైటీ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న, మగ్గరి హన్మాండ్లు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు దొంత ప్రవీణ్‌కుమార్, బాబర్, డైరెక్టర్లు కాంతంరెడ్డి, సొద శ్రీనివాస్, గణేశ్, రాము, సీఈవోలు మహేశ్, మేక రమేశ్ పాల్గొన్నారు. ఎడపల్లితోపాటు ఠానాకలాన్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. ఏవో సిద్ది రామేశ్వర్, సొసైటీ కార్యదర్శి రాజారాం, డైరెక్టర్లు కమలాకర్ రెడ్డి, ప్రభాకర్, లక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఆకుల సురేశ్ పాల్గొన్నారు. బాల్కొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులపల్లి సూరజ్‌రెడ్డి, డైరెక్టర్లతో కలిసి ప్రారంభించి మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ వితరణ

పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేస్తున్న దాత నవీన్

మోర్తాడ్, అక్టోబర్ 28: కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పుప్పాల నవీన్ రూ.25వేల విలువ చేసే కంప్యూటర్ సెట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంధ్రయ్యకు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. తన కొడుకు వైభవ్ పదో తరగతి చదువుతున్నాడని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో కంప్యూటర్‌ను అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

శక్కర్‌నగర్, అక్టోబర్ 28: బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాల యజమానులు జాగ్రత్తలు పాటించాలని బోధన్ అగ్నిమాపకశాఖ అధికారి గంగాదాస్ సూచించారు. సోమవారం సాయంత్రం దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు చేపట్టే చర్యలపై అవగాహన కల్పించారు. బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, అగ్నిమాపకశాఖ సిబ్బంది అహ్మద్, నర్సయ్య, రెడ్డి పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ.. ఒకరికి గాయాలు

ముప్కాల్, అక్టోబర్ 28: జాతీయ రహదారి 44 వేంపల్లి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న లారీ ముందున్న లారీని ఢీకొట్టింది. దీంతో క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోయాడు. ఎస్సై రజనీకాంత్, పోలీసులు, హైవే సిబ్బంది చేరుకుని గంట పాటు శ్రమించి బయటికి తీశారు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

మోర్తాడ్/ముప్కాల్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కమ్మర్‌పల్లిలో తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రాన్ని అందించారు. ముప్కాల్‌లో తహసీల్దార్ శ్రీకాంత్‌కు, మాక్లూర్‌లో తహసీల్దార్ శేఖర్‌కు తపస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్‌లో తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు.